గల్పిక

# గూడువీడిన గోరువంక

"మంజుశ్రీ"

ప్రొద్దుటే చల్లగాలి వొళ్ళు తట్టి కుఱ్ఱాణ్ణి నిద్ర లేపింది. కుడికాలుమీది మూడంగుళాల పొడుగు ఎఱ్ఱటి నెత్తురు మీది యీగలను విసురుకున్నాడు. కసురుకున్నాడు. గబగబ లేచి రాస్తామీద నడచిపోయాడు. కాసేపటికి బద్ధకంగా సూర్యుడు లేచి వొళ్ళు విరుచుకున్నాడు. సఱ్ఱున పరుగెత్తుకొచ్చాడు. తెల్లటి సూర్యుడి కిరణాలు సోకి కుఱ్ఱాడి వెంద్రుకలు మెఱసినై. విఱసినై. ముఖంమీదికి కుఱికినై. పంపుదగ్గరికొచ్చి ముఖం కడుక్కున్నాడు. తడి చేతులను తలకు రాచుకున్నాడు. రాగిరంగు వెంద్రుకలు నిగనిగలాడినై.

నడిరోడ్డుమీది కొచ్చేప్పటికి ఎవరో పెద్ద మనిషి చకచక పోతున్నాడు. "బాబూ, కానీ" అన్నాడు అలవాటు ప్రకారం కుఱ్ఱాడు. "ఛ, పాడుమొహమా. అప్పుడే తెల్లవారిందీ" ఆత్రంగా సాగిపోయాడు. ఆయన మనసులో తెల్లవారదు. ఇనుప కటకటాల గేటు వాకిలిముందు నిల్చొని 'అమ్మా' అని అరిచాడు. పాలుతాగి ఈజీచైరులో కూచునివున్న బొచ్చుకుక్క 'భౌ' మంది. కుఱ్ఱాడు వులిక్కిపడ్డాడు. కుఱ్ఱాడి మనసు కెలుక్కుపోయింది. కుఱ్ఱాడు కదలిపోయాడు. పెంకుటింటి బైటి వసారాముందు నిల్చొని 'అమ్మా' అన్నాడు. 'అప్పుడే తెల్లవారింది, లేవుపో, మరీ యీమధ్య బిచ్చగాళ్ళతో చచ్చిపోతున్నాం లేచింది మొదలు తిరిగి పడుకునేదాకా వొకటే గొడవ" అంది ఇరుగావిడ పొరుగావిడతో. ఆవిడ ఈవిడతో ఏకీభవించింది. ఆవిడ, ఈవిడతో మాట్లాడింది. కుఱ్ఱాడు పట్టించుకోలేదు.

"అమ్మా బిచ్చం"

"లేవుపో"

"అమ్మగారూ..."

"లేవుపోరా, బియ్యం తెచ్చుకోవాలి."

"చద్దిమెతుకులు పడెయ్యండి"

"లేవు పో... వెధవా."

కుఱ్ఱాడు కళ్ళుతిప్పుకుని వెళ్ళిపోయాడు.

ఇంకో ఇంటిదగ్గర ఆగాడు. అలవాటుగా అరిచాడు. వరండాకిటికీలోంచి భార్యచేతిలోని కాఫీ కప్పు తీసుకుంటున్న భావకవి చూశాడు.

"బిచ్చం పెట్టండమ్మా"

"లేవుపో..."

"నిన్నటాలనుంచి కూడు లేదు."

"ప్రొద్దున్నే ఎక్కణ్ణుంచి వస్తయిరా" భావకవి భార్య సూటిగా ప్రశ్నించింది. భావకవి కాఫీ పీలుస్తూ భావ విహారం చేస్తున్నాడు. కుఱ్ఱాడు కిటికీలోంచి చూశాడు. "అమ్మా చద్దిమెతుకులు పెట్టండి." పెద్దగా అరిచాడు. "పనిచేసేదాని కిచ్చాను. లేదుపో."భావకరిగారి భార్య గర్జించింది.

"అయితే కాసిని కాఫీ ఇయ్యండి" కుఱ్ఱాడు నదురూ బెదురూ లేకుండా అడిగాడు.

భావకవి విస్ఫులింగాలు రాల్చాడు. "పోరా, పో వెధవా పో" గర్జించాడు కుఱ్ఱాడు కదలిపోయాడు.

కుఱ్ఱాడు కదలుతూనే వున్నాడు. కరకరలాడుతూ పొద్దు నెత్తిమీదికి వచ్చింది. కుఱ్ఱాడు కదులుతూనే వున్నాడు. కుఱ్ఱాడికి పంపు కనపడ్డది. పంపుదగ్గరికివచ్చి పొట్టనిండా నీళ్లు పట్టించాడు. పచ్చచెట్టుకింద కాసేపు కూచున్నాడు. అల్లంత దూరాన చెత్తడబ్బాపక్క రెండు కుక్కలు విస్తరి కోసం పోట్లాడుకుంటున్నయి. వాటిపోట్లాట ఎంతకూ తగ్గలేదు. పోరు ఘోరమైంది. కుఱ్ఱాడు పోయి విస్తరెత్తుకొచ్చాడు. రెండు కుక్కలూ తోకలు ముడుచుకొని, గుఱ్ఱుమంటూ కదిలిపోయినయ్. కుఱ్ఱాడు పచ్చచెట్టుకిందకొచ్చి కూచున్నాడు. చెట్టుకొమ్మనుంచి పక్షిపిల్ల పడ్డది. కాసేపులో నాలుగు కాకులు చుట్టూచేరినై. పక్షిపిల్ల గోలపెట్టింది. కాకులు పొడిచినై. కుఱ్ఱాడు అదిలించాడు. పోయిదగ్గరకూచున్నాడు. కాకులు రాలేదు. కుఱ్ఱాడు పోలేదు. ★